## జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28: కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2న నంద్యాలలో నిర్వహించే వామపక్ష పార్టీల ర్యాలీని జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్ న్యూ డెమోక్రసీ) నాయకులు పిలుపునిచ్చారు. నంద్యాలలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి, తొలగించిన ఓటర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో పలువురు వామపక్ష, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా అర్జీలకు సత్వర పరిష్కారం--

### పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి: జేసీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబరు 28: పిజిఆర్ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రజా అర్జీలను వెంటనే పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ అధికారులను ఆదేశించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలను పిజిఆర్ఎస్‌లో సక్రమంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జేసీ, పిజిఆర్ఎస్ ద్వారా 299 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అధికారుల లాగిన్‌లలో పరిశీలించని 135 అర్జీలను వెంటనే ఓపెన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. రీఓపెన్ అయిన 13 అర్జీలను కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 158 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. భూ సమస్యలు, అడంగల్ సవరణలు, అసైన్డ్ భూములు, సర్వే తదితర అంశాలపై వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో సత్వరమే పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీఓ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూనెపల్లి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జికి దీక్షలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28: నూనెపల్లి రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ నూనెపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరవధిక రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఉద్యమాన్ని ప్రారంభించారు. నూనెపల్లి ప్రాంతంలోని 10 వార్డులకు చెందిన సుమారు 40 వేల మంది, 30 గ్రామాల ప్రజలు రైల్వే ట్రాక్ దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పశువులు, వ్యవసాయ పనిముట్ల రాకపోకలకు కూడా తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి కోసం ప్రయత్నాలు చేస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ఎంపీ బైరెడ్డి శబరి, మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. రైల్వే శాఖ నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి సిద్ధంగా ఉందని, స్థల సేకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగిస్తామని నూనెపల్లి అభివృద్ధి కమిటీ కన్వీనర్ శంకరయ్య, సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు మద్దతు ప్రకటించారు.



# కాపు బలిజ జేఏసీకి కొత్త సారథి.. మిద్దె సుబ్బారెడ్డి--

### జిల్లా వ్యాప్తంగా జేఏసీ బలోపేతమే లక్ష్యం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28–ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు బలిజ జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కాపు బలిజ జేఏసీ అధ్యక్షుడిగా మిద్దె వెంకట సుబ్బారెడ్డి (సుబ్బయ్య రాయల్)ను నియమించారు. సోమవారం ఒక ప్రకటనలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో



కాపు బలిజ జేఏసీని మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిలో విస్తరించి మరింత బలోపేతం చేస్తానన్నారు. కాపు బలిజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యువత, మహిళలను జేఏసీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ సంఘాన్ని పటిష్టం చేస్తామని తెలిపారు. పదవులు పొందిన వారు: గౌరవ సలహాదారుగా కొణిదెల ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా చిమ్మ నాగ వెంకట రవికుమార్, ట్రావెల్స్ వెల్ఫేర్ అధ్యక్షుడిగా అలా వెంకట నాగిరెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా సంగ జయంతి, యువజన అధ్యక్షుడిగా సూరిశెట్టి మధు, జిల్లా కార్యదర్శిగా చింతల నాగకుమార్, కార్యక్రమాల కమిటీ అధ్యక్షుడిగా పసుపులేటి ప్రసాద్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తోట వెంకటేశ్వర్లు, ముద్రణ మాధ్యమం జిల్లా అధ్యక్షుడిగా అనుమల శ్రీనివాసులు, జిల్లా సహాయక కార్యదర్శిగా అల్లాడి నాగేశ్వరరావు తదితరులను నియమించినట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

## ప్లాస్టిక్‌పై కమిషనర్ తనిఖీలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28–పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సోమవారం పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల నిల్వ, వినియోగాన్ని పరిశీలించి, నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## రేబీస్‌పై అప్రమత్తతే రక్షణ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28: ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా నంద్యాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శారద బాయి, జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ ఎస్. అశ్రుఫ్ ఆలీ రేబీస్ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రేబీస్ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కుక్కలు, ఇతర జంతువులు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, నీటితో శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా ప్రభుత్వ వైద్యసంస్థను సంప్రదించి యాంటీ రేబీస్ టీకా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి, డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీజ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రబీకి శనగ విత్తనాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28–: రబీ 2026 సీజన్‌కు నంద్యాల మండలానికి 450 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలో 477 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం ఉండగా, రైతులకు 35 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్వింటాలు పూర్తి ధర రూ.9,000 కాగా, రూ.3,150 రాయితీతో రైతు వాటా రూ.5,850గా ఉంటుందని తెలిపారు. ప్రతి రైతుకు విస్తీర్ణాన్ని బట్టి ఒకటి నుంచి గరిష్టంగా 10 బస్తాల వరకు విత్తనాలు అందిస్తామని, రైతులు తమ రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

## 138 ఫిర్యాదులపై ఎస్పీ విచారణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ ఐపీఎస్ 138 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. చట్ట పరిధిలోని సమస్యలను పూర్తిస్థాయిలో విచారించి, నిర్ణీత గడువులో సంతృప్తికరంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించరాదని, సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ వివాదాలు, నగదు మోసం తదితర అంశాలపై పలువురు ఫిర్యాదులు చేశారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రారంభోత్సవం ఘనం.. డివైడర్లు అసంపూర్తి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28: పద్మావతి నగర్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేస్తున్న ఇనుప డివైడర్ల పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, పాదచారులకు ప్రమాద ముప్పు ఏర్పడుతోందని ఎస్‌డీపీఐ నంద్యాల అసెంబ్లీ కమిటీ సభ్యుడు వి. హనీఫ్ తెలిపారు. కొంత దూరం వరకు డివైడర్లు ఏర్పాటు చేసినా రంగులు వేయకపోవడంతో తుప్పు పడుతున్నాయని, మరికొన్ని చోట్ల కేవలం ఇనుప పైపులు ఏర్పాటు చేసి పనులు నిలిపివేశారని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఇవి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రారంభోత్సవంతో పాటు డివైడర్ల పనులను పూర్తిస్థాయిలో పూర్తి చేసి, రంగులు, భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలని ఎస్‌డీపీఐ డిమాండ్ చేసింది. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వి. హనీఫ్ కోరారు.

## కాణిపాకం వేడుకలకు మహానంది పట్టువస్త్రాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28–కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ కామేశ్వరీ మహానందీశ్వర స్వామివారి తరఫున సోమవారం పట్టువస్త్రాలను శాస్త్రోక్తంగా సమర్పించారు. మహానంది దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళిరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు, ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ధర్మకర్తలు కాణిపాకం చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరఫున మహానందీశ్వర స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను ఎన్. శ్రీనివాసరెడ్డి, నరాల చంద్రమౌళిరెడ్డికి అందజేసి వేదాశీస్సులు అందించారు. అలాగే మహానంది దేవస్థానం తరఫున కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను స్వీకరించారు. ఇరు ఆలయాల ప్రతినిధులు వేదపండితుల ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమం రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని చాటిచెప్పింది.

## దాడి కేసులో ఇద్దరి అరెస్ట్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28: ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని త్రివేణి బార్‌లో గత నెల 8న జరిగిన దాడి కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇమ్రాన్, ఈశ్వర్‌లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. సల్మాన్‌రాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్ట్ చేశారు. ఇమ్రాన్‌పై నంద్యాల తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీట్ ఉన్నట్లు విచారణలో తేలిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని పోలీసులు హెచ్చరించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190